సాక్షి
అనకాపల్లి
శనివారం । 25 । జనవరి । 2025



నేడు గవరపాలెం ఉత్సవం

అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. IIలో



దివ్య స్వర్ణిమ రథయాత్ర

కశింకోటలో శుక్రవారం సాయంత్రం దివ్య స్వర్ణిమ రథయాత్ర కనుల పండువగా జరిగింది. IIలో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 31.1 నుంచి 32.3 వరకూ, కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 25న 18.5, 26న 20.5, 27న 21.0, 28న 21.1, 29న 21.5 డిగ్రీలు ఉంటుందని, గాలి గంటకు 3 కిలోమీటర్లు వీస్తుందన్నారు.







'ఏటికొప్పాక ఒకప్పుడు చిన్న పల్లెగ్రామం.. ఇప్పుడు హస్తకళల్లో ఖండాంతర ఖ్యాతిని ఆర్జించి..మేటి కొప్పాకగా నిలిచింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో లక్కబొమ్మలతో నమ్మశక్యం కాని కళాఖండాలను తయారు చేయగల నైపుణ్యం వారి సొంతం. ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏటికొప్పాక లక్క బొమ్మల శకటం ప్రదర్శనకు ఎంపికైంది. రంగులీనుతూ కనిపించే ఈ బొమ్మల వెనుక కళాకారుల సృజనాత్మకత మనల్ని కట్టిపడేస్తుంది. ఈ సందర్భంగా ఎన్నో హొయలు పోయే ఏటికొప్పాక లక్కబొమ్మలపై సాక్షి ప్రత్యేక కథనం...'

హస్త కళల్లో మేటి కొప్పాక







- గణతంత్ర వేడుకల్లో మన లక్కబొమ్మల ఘనత
- ఢిల్లీ పెరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రదర్శనకు ఎంపిక
- 400 ఏళ్ల హస్త కళకు.. 30 సహజ రంగులతో మెరుగులు
- ఈ బొమ్మలకు రాష్ట్రపతి, పద్మశ్రీ అవార్డులు
- ఇటీవల లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకాకర్షణగా ఈ బొమ్మలు

విదేశాలకు ఎగుమతి..


ఏటికొప్పాక బొమ్మలు అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, పోలెండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, నేపాల్, బ్రిటన్, జర్మనీ వంటి విదేశాలతో పాటు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, బెంగుళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, రాజస్థాన్, పాట్నా తదితర నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థల ఆన్‌లైన్ అమ్మకాలతో లక్కబొమ్మలు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాయి.

సాక్షి, అనకాపల్లి : యలమంచిలి మండలం ఏటికొప్పాకలో సుమారు ఏడు దశాబ్దాల కిందట జీవనోపాధి కోసం, కుటుంబ పోషణ నిమిత్తం లక్కబొమ్మల తయారీని కేవలం 4 విశ్వకర్మ కుటుంబాలు చేపట్టాయి. నేడు అంకుడు కర్రలతో లక్కబొమ్మలు తయారు చేసే హస్త కళాకార కుటుంబాలు ఈ గ్రామంలో దాదాపు 150 వరకూ వున్నాయి. సూదిమొన పరిమాణంలోని కళాఖండాలను సృష్టించే ఏటికొప్పాక హస్త కళాకారుల నైపుణ్యం ఔరా అనిపిస్తుంది. మారుతున్న కాలానికి, సాంకేతికతకు అనుగుణంగా ఇక్కడి కళాకారులు విశేష నైపుణ్యంతో అపురూప కళాఖండాలను తమ మునివేళ్లతో సృష్టించి మేధావులను సైతం అబ్బురపరుస్తున్నారు.

తూర్పు కొండల నుంచి సహజ రంగులు

ఈ కళాకారులు లక్కకి సహజమైన రంగులను కలిపి అనేక ప్రయోగాలు చేస్తుంటారు. ఒక చిన్న పొయ్యి, ఉసిరి, కరక్కాయ, వేపవంటి వాటితోనే పరిశోధనలు చేసి సహజ సిద్ధమైన రంగులను తయారు చేస్తారు. సహజమైన లక్క ఎక్కువగా రాంచీ నుంచి వస్తుంది. అక్కడ ఒక రకమైన సూక్ష్మ క్రిమి విసర్జితాల నుంచి ఇది లభిస్తుంది. దాన్ని స్థానిక గిరిజనులు సేకరించి విక్రయిస్తారు. ఆ లక్కకి తూర్పుకనుమల్లో దొరికే వివిధ మొక్కలు, వాటి విత్తనాలు, ఆకులు, వేళ్లు, కాండం, కలువు నుంచి వచ్చే సహజ సిద్ధమైన రంగులను కలువుతారు. 100 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద లక్కని వేడిచేసి, రంగుని కలిపి దాన్ని బొమ్మలకు అద్దుతారు. 1990 వరకు ఈ బొమ్మలకు రసాయన రంగులే పూసేవారు. అయితే ఆ గ్రామానికి చెందిన సీవీ రాజు (చింతలపాటి వెంకటపతిరాజు) రసాయన రంగుల స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడడం మొదలుపెట్టారు. క్రమంగా సహజ రంగుల తయారీని గ్రామంలోని కళాకారులు నేర్చుకుని బొమ్మలకు వాటిని అద్దడం ప్రారంభించారు. దీంతో ఏటికొప్పాక బొమ్మల అందం మరింత ఇనుమడించింది. చాలా మంది తమ ఇళ్ల షో కేసుల్లో ఏటికొప్పాక బొమ్మలను అలంకరించుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. మరికొందరు అధికారులు, అతిథులు, బంధువులకు శుభకార్యాల సమయంలో ఈ బొమ్మలను కానుకలుగా ఇస్తుంటారు.







బొమ్మల తయారీలో మహిళలు

ఏటికొప్పాకలోని ప్రతి ఇంటిలో బొమ్మల తయారీ కళాకారులుంటారు. ఇందులో మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉండడం విశేషం. ఇంటి పనులు చూసుకుంటూ వీలు దొరికినప్పుడు బొమ్మల తయారీ చేస్తుంటారు. కుంకుమ భరిణిలు, ఆభరణాలు దాచుకునే డబ్బాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, మహిళలు ధరించే గాజులు, కీచైన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, రైలు బండ్లు, ద్విచక్రవాహనాలు, దేవతామూర్తుల బొమ్మలు మొదలుకుని గ్రామీణ వాతావరణం, తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి ఫోటోలు, రామాంజనేయ యుద్ధ సన్నివేశాలు, పెళ్లి తంతు, పెళ్లి సారె, రిస్ట్ వాచీలు ఇలా ఎన్నో రకాల బొమ్మలన్నీ హస్త కళాకారుల చేతి నుంచి రూపుదిద్దుకున్నవే.

అవార్డులను పండించే కళ

- ఏటికొప్పాకలో లక్క బొమ్మలను వినూత్న రీతిలో తయారు చేసే కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర అవార్డులు కూడా లభించాయి. దేశ ప్రధాని సైతం 'మన్ కీ బాత్' లో లక్క బొమ్మల విశిష్టతను గురించి ప్రస్తావించారు. ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2016లో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక బొమ్మల స్టాల్‌ని నేరుగా ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడ తన ఫొటో పెట్టి తయారు చేసిన లక్క డబ్బాని చూసి ముచ్చటపడి దాని మీద సంతకం చేశారు.
- సహజసిద్ధమైన రంగులతో ప్రయోగాలు చేసి ఏటికొప్పాక బొమ్మకి కొత్త కళను తెచ్చినందుకు సీవీ రాజుకి 2002లో రాష్ట్రపతి అవార్డు, 2012 లో నేషనల్ ఇన్నోవేషన్ అవార్డు వచ్చింది. ఏటికొప్పాకకు చెందిన మరో కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి మైక్రో ఆర్ట్స్ చేయడంలో నిపుణుడు. 2003లో జాతీయ హస్త కళల పోటీలో ప్రథమ బహుమతి లభించింది. బియ్యపు గింజమీద పట్టేంత వీణ, గుండుసూది మీద పట్టేంత తాజ్ మహల్, 5.5 మీమీ పరిమాణంలో తయారు చేసిన అతి చిన్న చెస్ బోర్డు వంటి మినీయేచర్ ఆర్టులను తయారు చేశారు.
- విశాఖకు చెందిన ప్రొఫెసర్ బొగాది నీలిమ ఏటికొప్పాక హస్తకళా నైపుణ్యంపై 'సాగా ఆఫ్ ది విమెన్' పేరిట డాక్యుమెంటరీ తీసి, ప్రపంచంలో రెండో స్థానం కైవసం చేసుకున్నారు. జూన్‌లో కర్నూల్‌లో జరిగిన లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌లో ఈ బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఢిల్లీలో ఏటికొప్పాక శకటం ప్రదర్శన అభినందనీయం



స్థానికంగా అంకుడు కర్ర డిపో ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది. అద్భుతమైన లక్కబొమ్మల తయారీ కళ అంతరించిపోకూడదు. మా పూర్వీకుల నుంచి వచ్చిన ఈ కళను కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు గ్రామంలో 100 మందికి పైగా మహిళలకు శిక్షణ నిచ్చాం. ప్రస్తుతం వారికి ఉపాధినిస్తోంది. ఇపుడు ఢిల్లీలో ఏటికొప్పాక శకటం ప్రదర్శన అభినందనీయం. –శ్రీశైలపు చిన్నయాచారి, కళాకారుడు, జాతీయ అవార్డు గ్రహీత

కళాకారులకు, కళకు దక్కిన గౌరవం..



ఈ నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో ఏటికొప్పాక లక్కబొమ్మలు శకటం ప్రదర్శించనుండడం హర్షించదగ్గ నిర్ణయం. పీఎం మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇది కళాకారులను, కళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఏటికొప్పాక లక్కబొమ్మల ప్రాముఖ్యత ఎప్పటికీ తగ్గదు. కళాకారులకు మరింత ప్రోత్సాహం కల్పించాలన్నదే నా ఆకాంక్ష. – చింతలపాటి వెంకటపతిరాజు (సీవీరాజు), పద్మశ్రీ అవార్డు గ్రహీత

న్యూస్‌రీల్

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఉమ్మలాడ వాసికి ఆహ్వానం



భీశెట్టి లావణ్య రమాకుమారి

మునగపాక : మండలంలోని ఉమ్మలాడకు చెందిన గృహిణి లావణ్య రమాకుమారికి ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన సూర్యఘర్ పథకం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నందున ఆమెకు ఆహ్వానం అందినట్టు తెలిపారు. పాయకరావుపేటకు చెందిన భీశెట్టి నాగేశ్వరరావు–లావణ్య రమాకుమారి దంపతులు కొన్నేళ్ల క్రితం ఉమ్మలాడ వచ్చి స్థిరపడ్డారు. విద్యుత్ ఆదాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం ద్వారా ఇంటిపైన రాయితీపై సోలార్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద రమాకుమారి ఏడాది క్రితం 5 కేవీ విద్యుత్ ఉత్పత్తయ్యేలా సోలార్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. గతంలో నెలకు రూ.3వేలకు పైగా విద్యుత్ బిల్లులు చెల్లించేవారమని, నేడు ఈ పథకం ద్వారా జీరో బిల్లు వస్తుందని రమాకుమారి తెలిపారు.

సివిల్ సప్లయి హమాలీల మెరుపు సమ్మె

- కూలీ రేట్ల జీవో విడుదలకు డిమాండ్



సివిల్ సప్లయి గిడ్డంగి వద్ద మెరుపు సమ్మె చేస్తున్న హమాలీలు

తుమ్మపాల : ప్రభుత్వ జీవో ప్రకారం పెంచాల్సిన కూలీ రేట్లు తక్షణమే అమలు చేయాలంటూ సివిల్ సప్లయి గిడ్డంగుల్లో హమాలీలు శుక్రవారం మెరుపు సమ్మె చేశారు. మండలంలో రేబాకలో గల సివిల్ సప్లయి గిడ్డంగి వద్ద సమ్మె చేస్తూ వారి నిరసన తెలియజేశారు. కూలిరేట్లు పెరిగి మూడు నెలలు పూర్తయినా జీవో విడుదల చేయలేదని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయి హమాలీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ప్రధాన కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ అన్నారు. 2023 డిసెంబర్ 31తో అగ్రిమెంట్ కాలం పూర్తయిందని, 2024 జనవరి నుంచి అగ్రిమెంట్ చేయాల్సి ఉందని, కానీ ఇప్పటికే 13 నెలలు గడిచినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే కూలీ రేట్లు జీవో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చోడవరం నా భాగ్యంగా భావిస్తా..

- నా చివరి శ్వాస వరకు ఇక్కడి ప్రజలకు సేవ చేస్తా..
- వైఎస్సార్‌సీపీ చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్
- చోడవరంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం
- రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణుల సందడి



అమర్, ముత్యాలనాయుడు, ధర్మశ్రీని గజమాలతో అభినందిస్తున్న పార్టీ కార్యకర్తలు

చోడవరం : రాజకీయాల్లో ఉన్నంత వరకూ తాను చోడవరం నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం చోడవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమన్వయకర్తగా నియమితులైన తర్వాత మొదటిసారిగా చోడవరం విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి అమర్‌నాథ్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడ నుంచి పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ , స్థానిక నాయకుల సూచన మేరకే తనను పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి చోడవరం సమన్వయకర్తగా నియమించారని అమర్‌నాథ్ చెప్పారు. తన తండ్రి గుడివాడ గురునాథరావు చోడవరం నుంచి గతంలో పోటీ చేయాలని భావించినా అప్పట్లో అవకాశం రాలేదని, ఇప్పుడు తనకు ఇక్కడ ప్రజలకు సేవ చేసే భాగ్యం వైఎస్సార్ సీపీ కల్పించిందని అమర్‌నాథ్ అన్నారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ ఈ నియోజకర్గంలో ప్రజలకు సేవ చేస్తానని అమర్‌నాథ్ అన్నారు. ధర్మశ్రీ 20 యేళ్లపాటు ఈ ప్రాంత ప్రజలకు సేవ చేశారని, ఇప్పుడు పార్లమెంటు స్థాయిలో ఏడు నియోజకవర్గాల్లో సేవ చేసే అవకాశం ఆయనకు దక్కిందన్నారు. 2029లో అనకాపల్లి పార్లమెంటు స్థానంలో అన్ని స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిపించుకోవడమే లక్ష్యంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు, పరిశీలకుడు ధర్మశ్రీతో కలిసి పనిచేస్తామని అన్నారు. కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యమని, తనకు పూర్తి స్థాయిలో అంతా మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని తమ ప్రభుత్వ హయాంలో రూ. 89.90 కోట్లు ఇచ్చి ఆదుకోవడం జరిగిందని, ఈ ప్రభుత్వ హయాంలో ఇప్పటికీ ఇంకా రైతులకు, కార్మికులకు పాత బకాయిలు ఇవ్వలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ నిర్ణయాలే తీసుకున్నారని, ఇప్పుడు వాటిని ఈ కూటమి ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో తమ గొప్పగా చెప్పుకుంటోందని అమర్‌నాథ్ విమర్శించారు.

పార్టీ విజయానికి సమష్టిగా కృషి : పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి

జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ అమర్‌నాథ్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులంతా అక్కున చేర్చుకొని రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమష్టిగా కృషిచేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడు ఎవరిని ఎక్కడ పోటీ చేయమని చెబితే అక్కడ వారు పోటీ చేయడానికి అంతా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యకర్తలకు అండగా అమర్‌నాథ్ పూర్తిస్థాయిలో ఉంటారన్నారు.

అందరి అభీష్టంతోనే : మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ 20 ఏళ్లుగా తనతో కలిసి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తాను రుణపడి ఉంటానన్నారు. తన ఇష్టపకారం, తనతో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకొని అమర్‌ను సమన్వయకర్తగా నియమించడం జరిగిందని, ఆయన విజయానికి అంతా సమష్టిగా కృషి చేయాలని అన్నారు. తనకు పార్లమెంటు పరిశీలకుడుగా పార్టీ ఇచ్చిన బాధ్యతలను ఎంతో ఇష్టంగా స్వీకరిస్తున్నానని ధర్మశ్రీ చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దంతులూరి దిలీప్‌కుమా ర్, ఏడువాక సత్యారావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిక్కాల రామారావు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, రైతు విభాగం అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కల్లుగీత కులాలకు 15 మద్యం దుకాణాలు

తుమ్మపాల : జిల్లాలో కల్లుగీత కులాల వారికి లాటరీ ప్రక్రియ ద్వారా 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, గీత కులాల నేతల సమక్షంలో ఆమె లాటరీ నిర్వహించి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024–2026 సంవత్సరానికి సంబంధించి మద్యం దుకాణాలకు గీత కులాల ఎంపికకు లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయింపు ప్రక్రియను ప్రారంభించామన్నారు.

జిల్లాకు సంబంధించి శెట్టిబలిజ, యాత, గౌడ్, గౌడ అనే 4 కల్లుగీత ఉప కులాలను గుర్తించి శెట్టిబలిజ–9, యాత–4, గౌడ –1, గౌడ్ –1, మొత్తం 15 మద్యం దుకాణాలు ఎంపిక చేయడం జరిగిందన్నారు. లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, దుకాణాలకు (ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ /హైబ్రిడ్ మోడ్) ఫిబ్రవరి 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు నమోదు చేసి సమర్పించాలన్నారు. ఫిబ్రవరి 6న దరఖాస్తుల పరిశీలన లాటరీకి సంబంధించిన సన్నాహాలు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందని ఎంపికైన దరఖాస్తుదారులకు సమాచారం అందజేయడం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కల్లు గీత ఉప కులాల నాయకులు పిల్లి రాంబాబు, పాలిక వెంకన్న, గుత్తుర్తి పాండురంగ, దుంగ అప్పలరాజు పాల్గొన్నారు.

మండలాల వారీగా కేటాయించిన మద్యం దుకాణాలు వివరాలు

- శెట్టిబలిజ : అనకాపల్లి రూరల్, నక్కపల్లి, నాతవరం, చీడికాడ, వి మాడుగుల, మునగపాక , కశింకోట, రాంబిల్లి, బుచ్చయ్యపేట
- యాత : రోలుగుంట, పాయకరావుపేట, దేవరాపల్లి, రావికమతం
- గౌడ: మాకవరపాలెం
- గౌడ్ : యలమంచిలి



గీత కార్మికుల మద్యం దుకాణాల లాటరీ నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

యువతే కీలకం

- ఓటరు నమోదులో యువ చైతన్యం
- జిల్లాలో ఏడాది కాలంలో నమోదైన 17 వేల నూతన యువ ఓటర్లు
- జిల్లాలో మొత్తం ఓటర్లు– 12,91,044
- ఆన్‌లైన్‌లో ఓటు నమోదు అవకాశం
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

తుమ్మపాల : ఓటు చరిత్రను మారుస్తుంది... భవితకు బాటలు వేస్తుంది. నా ఒక్క ఓటే ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు. నీ ఓటే ప్రజాస్వామ్యానికి బలం, పునాది. ప్రతి ఒక్కరు ఓటు వేయడం ద్వారానే ప్రజాస్వామ్యం బలం మరింత దృఢపడుతుంది. నేడు జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా ఎన్నికల సంఘం ఓటరు చైతన్యంపై అనేక కార్యక్రమాలు చేపడుతుంది.

- అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటరుగా నమోదు చేసుకోవడం ఒకప్పటి కన్నా ఇప్పుడు చాలా సులభం. నిరంతరం ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అనేక మాధ్యమాలను జనం ముందుంచింది. పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక శిబిరాలను కూడా నిర్వహిస్తుంది. ముఖ్యంగా యువతను ఆకర్షిస్తూ చేపట్టిన కార్యక్రమాల ద్వారా గడిచిన ఏడాది కాలంలో 18–19 ఏళ్ల పూర్తయిన యవత 17,225 మంది నూతన ఓటర్లుగా నమోదయ్యారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు....

జిల్లాలో మొత్తం ఓటర్లు 12,91,044 మందిలో పురుషులు మొత్తం 6,27,984 మంది, స్త్రీలు 6,63,032 మంది, థర్డ్ జెండర్ 28 మంది ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్లు 17,225 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 3,987 మంది కాగా వారిలో పురుషులు 3,851, స్త్రీలు 136 మంది. మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,529 ఉన్నాయి.

- స్త్రీ, పురుష ఓటర్ల సంఖ్య పెద్దగా తేడా లేనప్పటికీ ఎన్నికల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్ల పోలింగ్ శాతమే ఎక్కువగా నమోదవుతుంది. శతశాతం ఓటు హక్కు వినియోగం జరిగేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు.



ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని వ్యవస్థలు ఆన్‌లైన్‌లో సేవలు అందించడంలో పోటీ పడుతున్నాయి. ఎన్నికల సంఘం కూడా ప్రజల సౌలభ్యానికి అనుగుణంగానే ఆన్‌లైన్‌లోనే సేవలు ముమ్మరం చేసింది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు ఓటర్ సర్వీస్ పోర్టల్, ఇ–ఈపీఐసీ, ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లను ప్రజల ముందుంచింది. 17 ఏళ్ళు పూర్తయిన వారు కూడా ముందుగా ఓటు హక్కు నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

వికలాంగుల కోసం సాక్షం యాప్

సాక్షం యాప్ ద్వారా దివ్యాంగులు ఓటు నమోదు చేసుకోవడానికి, పోలింగ్ స్టేషన్ కనుక్కోడానికి, ఓటు వేసేందుకు గల అన్ని సౌకర్యాలను ఎన్నికల సంఘం యాప్‌లో పొందుపరచింది. దృష్టి లోపం ఉన్నవారి కోసం వాయిస్ సహాయం, వినికిడి లోపం గల వారికి టెక్స్ టు స్పీచ్, పెద్ద ఫాంట్, హై–కాంట్రాస్ట్ కలర్, పోలింగ్ స్టేషన్ సౌకర్యాలు, అధికారుల వివరాలతో కూడిన మొత్తం సమాచారం ఉంటుంది. ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కు వినియోగానికి ఎదురైన సమస్యలపై ఫిర్యాదులకు కూడా యాప్‌లో సౌకర్యం ఉంది.

వికలాంగులకు, వృద్ధులకు హోమ్ ఓటింగ్

గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో వికలాంగులు, మంచాన ఉన్న వృద్ధుల ఇంటి వద్దకు ముందుగానే వెళ్లి హోమ్ ఓటింగ్ చేపట్టారు. జిల్లాలో ప్రతి గ్రామంలోను హోమ్ ఓటింగ్ జరిగింది. పటిష్టమైన చర్యలతో పొరపాట్లకు అవకాశం లేకుండా చక్కని సౌకర్యంగా దివ్యాంగులు, వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.

నియోజకవర్గాల వారీగా స్త్రీ, పురుషులు, ఓటర్ల సంఖ్య వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
చోడవరం	243	1,05,698	1,12,023	7	2,17,728
మాడుగుల	235	92,028	96,893	2	1,88,923
అనకాపల్లి	251	1,03,140	1,10,728	5	2,13,873
యలమంచిలి	246	1,00,683	1,06,339	8	2,07,030
పాయకరావుపేట	292	1,23,528	1,27,563	2	2,51,093
నర్సీపట్టణం	262	1,02,907	1,09,486	4	2,12,397
మొత్తం	1,529	6,27,984	6,63,032	28	12,91,044

క్లుప్తంగా

కనుల పండువగా దివ్య స్వర్ణిమ రథయాత్ర



రథంపై ఊరేగిస్తున్న సోమనాథేశ్వర వజ్ర లింగం

కశింకోట: కశింకోటలో శుక్రవారం సాయంత్రం దివ్య స్వర్ణిమ రథయాత్ర కనుల పండువగా జరిగింది. బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో రథంపై ఊరేగించిన గుజరాత్‌లోని సోమనాథేశ్వర వజ్ర లింగాన్ని భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. స్థానిక సంతబయల కనక మహాలక్ష్మి ముఖ ద్వారం వద్ద స్వర్ణిమ రథానికి మహిళలు ఎదురేగి వెళ్లి పూర్ణ కుంభం, కలశాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు కోలాటాలు ప్రదర్శించారు. అక్కడి నుంచి మేళ తాళాలతో ప్రారంభమైన రథయాత్ర గవరపేట, పెద్ద బజారు, కస్పావీధి, ఉప్పునీటి దిబ్బ, అగ్రహారం వీధుల మీదుగా సాగింది. దారి పొడవునా ప్రజలు రోడ్డుపై నీరు పోసి పువ్వులు చల్లి ఘన స్వాగతం పలికారు. బ్రహ్మ కుమారీ ప్రతినిధులు విద్య, లత, సుభాష్ తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, బ్రహ్మకుమారీ ప్రతినిధులు ధనలక్ష్మి, సూరిశెట్టి గణేష్, జనసేన నాయకుడు బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: రాష్ట్రంలో ఖ్యాతిగాంచిన అనకాపల్లి గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ సంఖ్యలో భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గవరపాలెంతో పాటు 37 కూడళ్లలో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ ఉత్సవం సాగనుంది.

స్థల పురాణం

సంతకంపట్టులో వెలసిన గౌరీపరమేశ్వరుల ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. ప్రస్తుతం సతకంపట్టుగా పేరొందిన గవరపాలెంలోని అమ్మవారు కొలువైన ప్రాంతం 140 ఏళ్ల కిందట పొలాల్లో ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న మునగచెట్టు కింద స్థానికులు కొందరు గ్రామదేవత గైరమ్మను ప్రతిష్ఠించారు. పూరిపాకలో ఉన్న ఆలయం అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో అమ్మవారి గుడిని నిర్మించి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఉత్తరాంధ్రతో పాటు వివిధ జిల్లాల నుంచి అమ్మవారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరుతారు. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ ఏడాది 15 సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రసాద వితరణ జరగనుంది.

మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఊరేగింపు



వివిధ రూపాల్లో విద్యుత్ లైటింగ్ సెట్‌లు

గౌరీపరమేశ్వరుల ఊరేగింపు రథాన్ని శనివారం మధ్యాహ్నం 12.45 గంటలకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించనున్నారు. ఈ ఊరేగింపులో నేలవేషాలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అమ్మవారి ఊరేగింపు ఉత్సవం సతకంపట్టులో కొలువై ఉన్న గైరమ్మ గుడి నుంచి పార్కు జంక్షన్, మెయిన్ రోడ్డు, చిన నాలుగు రోడ్ల జంక్షన్ మీదుగా రింగ్ రోడ్డు వరకూ సాగనుంది. గవరపాలెం సంతోషిమాత ఆర్చ్ పక్కన మందుగుండు సీతారామయ్య కుటుంబం ఆధ్వర్యంలో భారీ బాణసంచా కాల్చనున్నారు. సుంకర మెట్ట జంక్షన్ నుంచి పెరుగుబజార్ జంక్షన్ వరకూ, గవరపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రశాంత వాతావరణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ సభ్యులు చర్యలు చేపట్టాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారిని శుక్రవారం రాత్రి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవం కోసం గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అంతకు ముందు ఆలయ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు ఎస్పీని శాలువాలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.శ్రావణి, బి.అప్పారావు, సీఐలు టి.వి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టిప్పర్ల యజమానుల నిరసన

- తారు ప్లాంట్‌కు తారు తరలింపు నిలిపివేత
- బకాయిలు చెల్లించాలని డిమాండ్



రెండు రోజులుగా నిలిచిపోయిన తారు ప్లాంట్

తుమ్మపాల: ప్రతి 15 రోజులకు ఒక సారి చెల్లించాల్సిన టిప్పర్ల కిరాయి చెల్లించకుండా వారం రోజులుగా ఇబ్బందులు పెడుతున్న తారు ప్లాంట్‌లో తారు తరలించకుండా టిప్పర్ల యాజమానులు రెండు రోజులుగా నిరసనకు దిగారు. దీంతో ముడిసరుకు లేక తారు ప్లాంట్ నిలిచిపోవడంతో అనకాపల్లి –విశాఖ రహదారిపై లేయర్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ రహదారిపై మరమ్మతులు చేపట్టి లేయర్ వేసేందుకు క్వారీలు, క్రషర్లు అధికంగా ఉన్న మండలంలో చింతనిప్పుల అగ్రహారం, మార్టూరు గ్రామాల మధ్య ఓ ప్రైవేటు హాట్‌మిక్స్ ప్లాంట్‌ను రెండు నెలల క్రితం ఏర్పాటు చేశారు. ముడి సరుకుతో పాటు తారు తరలింపునకు ఇరు గ్రామాల్లో గల లారీలకు కిలోమీటర్‌కు రూ. 150 నుంచి రూ. 200 వరకు కిరాయి చెల్లించే ఒప్పందంతో ప్రతి 15 రోజులకు బిల్లు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. చింతనిప్పులు అగ్రహారం రోడ్డును గ్రామస్తులు నిలిపివేయడంతో విశాఖ రోడ్డుకు తారును తరలించాల్సిన టిప్పర్లు మార్టూరు, తుమ్మపాల మీదుగా బొజ్జన్నకొండ రోడ్డుకు చేరి జాతీయ రహదారి మీదుగా విశాఖ రోడ్డుకు చేరుకోవాల్సి వస్తుంది. దీంతో సుమారు 10 కిలోమీటర్లు అదనంగా చెల్లించాల్సి వస్తుందంటూ ప్లాంట్ యాజమాన్యం బిల్లులు నిలిపివేసింది. గ్రామస్తుల అనుమతి తీసుకుని చింతనిప్పుల అగ్రహారం మీదుగానే వెళ్లాలని ఆదేశించడంతో చేసేదేమి లేక టిప్పర్ల యాజమానులందరు ఏకమై ప్లాంట్‌కు ముడిసరుకు, తారు తరలించడాన్ని నిలిపివేశారు. బకాయి ఉన్న బిల్లులు చెల్లిస్తే చాలంటూ మొరపెడుతున్నారు.

జీవీఎంసీ జోనల్ కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలు

మహారాణిపేట(విశాఖ): అనకాపల్లిలో అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై అప్పటి జీవీఎంసీ జోనల్ కమిషనర్‌తో పాటు మరో 10 మంది సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022లో అనకాపల్లిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అయినప్పటికీ అధికారులు వాటిపై చర్యలు తీసుకోలేదు. దీంతో 2022 ఆగస్టు 4న అప్పటి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అక్రమ నిర్మాణాలు బయటపడటంతో అధికారులు నివేదిక రూపొందించారు. దీంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏసీపీలు డి.శ్రీనివాసరావు, పి.రోహిణి, పి.అమ్మాజీ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ గాడి విజయకుమార్, సిద్ధబత్తుల వరప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి గ్రంథి నాగలత, టౌన్ సర్వేయర్ డి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ పి.శివమూర్తి, జూనియర్ అసిస్టెంట్ నూక రాములపై క్రమశిక్షణ చర్యల కోసం సిఫారసు చేశారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేత బి.కొత్తూరు



మామిడిపల్లిలో ఎడ్ల బళ్ల పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు

- వైభవంగా మరిడిమాంబ తీర్థం
- రసవత్తరంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు
- అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి : మామిడిపల్లిలో మరిడిమాంబ తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 15 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలలో బోయిల కింతాడ కొత్తూరు మురికితి శంకర్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నర్సయ్యపేట శ్రీసిద్ధి వినాయక ఎడ్లు ద్వితీయ స్థానంలోను, నర్సయ్యపేట ముమ్మిన కనకరాజు ఎడ్లు తృతీయ స్థానంలోను నిలిచారు. మామిడిపల్లి లెక్కల సత్యనారాయణ నాలుగో స్థానంలోను, మరిడిమాంబ అమ్మవారు కూండ్రం ఎడ్లు ఐదో స్థానంలోను, దేవరాపల్లి వారాది భరద్వాజ్ ఎడ్లు ఆరో స్థానంలోను నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, వెయ్యి చొప్పున నగదు బహుమతులను స్థానిక గ్రామ పెద్దలు అందజేశారు. మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు రూ.10 వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన జరిగింది. రాత్రికి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాజీ డిప్యూటీ సీఎం పూజలు

మరిడిమాంబ అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు ఉన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

చెరకు క్రషర్ దగ్ధం

- సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం
- బాధిత రైతుకు మాజీ డిప్యూటీ సీఎం బూడి పరామర్శ

దేవరాపల్లి: మండలంలోని ఎ.కొత్తపల్లి పంచాయతీ శివారు అచ్చియ్యపాలెం రైతుకు చెందిన చెరకు క్రషర్ దగ్ధమైంది. వావిలపాడు సమీపంలోని చెరకు క్రషర్ వద్ద గురువారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పెద్దాడ రాముకు చెందిన చెరకు క్రషర్ పూర్తిగా బూడిదయ్యింది. స్థానిక బెల్లం క్రషర్ నిర్వాహకులు సమీపంలోని తీర్థానికి వెళ్లగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్నప్పటికీ అప్పటికే నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో విక్రయానికి సిద్ధం చేసిన సుమారు ఐదు టన్నుల మేర బెల్లంతో పాటు షెడ్డు, బెల్లం తయారీకి వినియోగించే ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది.



దగ్ధమైన చెరుకు క్రషర్‌ను పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

బాధిత రైతుకు పరామర్శ

అగ్నిప్రమాదంలో చెరకు క్రషర్ దగ్ధమైన ప్రాంతాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు శుక్రవారం సందర్శించారు. బాధిత రైతును పరామర్శించి, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు పాల్గొన్నారు.

భార్య పదవి.. భర్త ప్రమాణ స్వీకారం!

- రైవాడ ప్రాజెక్టు పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఘటన
- ఎమ్మెల్యే బండారు సమక్షంలోనే ప్రమాణం చేయించిన అధికారులు
- ఇరిగేషన్ డీఈఈ సత్యంనాయుడు తీరుపై సర్వత్రా విమర్శలు



రైవాడ ప్రాజెక్టు వైస్ చైర్మన్‌గా భార్యకు బదులుగా భర్త అక్కునాయుడుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారులు, చిత్రంలో ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి : భార్య పదవికి..భర్త ప్రమాణ స్వీకారం చేసిన ఘటన దేవరాపల్లిలో చోటు చేసుకుంది. రైవాడ ప్రాజెక్టు పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహంలో శుక్రవారం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాజెక్టు చైర్మన్‌గా పోతల పాత్రునాయుడు ప్రమాణ స్వీకారం చేయగా, వైస్ చైర్మన్‌గా ఎ.కోడూరుకు చెందిన బొడ్డు ఉమాదేవికి బదులుగా ఆమె భర్త బొడ్డు అక్కునాయుడుతో ఇరిగేషన్ డీఈఈ జి. సత్యంనాయుడు ప్రమాణ స్వీకారం చేయించడం వివాదాస్పదంగా మారింది. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే సదుద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించిన రిజర్వేషన్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు తూట్లు పొడవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే సైతం ఈ ప్రమాణ స్వీకారాన్ని కొనసాగించడం పట్ల పలువురు కూటమి నాయకులు సైతం విస్మయం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ముమ్మాటికీ అవమాన పరచడమేనని పలువురు ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

‘ఉపాధ్యాయులూ అలసత్వం తగదు’



బంగారమ్మపాలెం మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు



పాఠశాలలో చీపురు పట్టుకుని గదిని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: ఉపాధ్యాయులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు హెచ్చరించారు. మండలంలో పలు పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రేవుపోలవరం పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా హాజరు కావడం లేదని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అర్జిలి యర్రయ్య రెండు రోజుల క్రితం ఫోన్ ద్వారా డీఈవోకు ఫిర్యాదు చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు సెలవులు పెడుతున్నారన్నారు. ఈ మేరకు డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ, అదనపు తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పీఈటీ లేరని, మధ్యాహ్న భోజన వంటలు చేసేందుకు షెడ్డు లేదని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బంగారమ్మపాలెం యూపీ స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులతో మాట్లాడి మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. అలాగే కొరుప్రోలు ఉన్నత పాఠశాలను సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా బోధన చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు చీపుర్లు పట్టుకోవడంపై విమర్శలు

రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో డీఈవో వచ్చి వెళ్లిన గంటలోనే తరగతి గదులు శుభ్రం చేసుకోవాలని చెప్పడంతో విద్యార్థులు చీపుర్లు పట్టుకున్నారు. మధ్యాహ్నం భోజన సమయం ముగిశాక గదులు శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. విద్యార్థులు చీపుర్లు పట్టుకోవడం పట్ల వారి తల్లిదండ్రులు విమర్శలు చేశారు. ఉపాధ్యాయులు తీరు అసలు బాగాలేదని, ఇదే పరిస్థితి కొనసాగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

బాలికల పట్ల వివక్ష విడనాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా శిశు సంక్షేమ అధికారి కె.అనంతలక్ష్మి

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా శిశుసంక్షేమ అధికారిణి కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలను జననాల రేటు గతంలో పోల్చుకుంటే ఇప్పుడు బాగా తక్కువగా ఉందని, ఆడపిల్లలను కనడం ఎంతో బాధ్యతతో, ఖర్చుతో కూడుకున్న పనిగా తల్లిదండ్రులు భావిస్తున్నారని ఈ భావనను తల్లిదండ్రులు విడనాడాలని ఆమె పేర్కొన్నారు. డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ మాట్లాడుతూ ఆడపిల్లల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని ఎటువంటి సమస్య వచ్చినా దానిని అధిగమించే శక్తి సామర్థ్యాలు కలిగి ఉండాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్ మాట్లాడుతూ లింగ వివక్ష చూపకుండా బాలికలు బాలురతో ఏవిషయంలో తీసిపోరన్నారు. అంతకుముందు వేల్పులవీధి అంగన్‌వాడీ ఉద్యోగులు బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సబ్‌ఇన్స్‌పెక్టర్ కె.సంతోష్‌కుమార్, ఎన్‌జీవో సీడ్ చిన్నారావు, మెడికల్ అధికారి ప్రియాంక, వన్ స్టాప్ సెంటర్ నిర్వహకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన శివ ప్రసాద్

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ రామచంద్రపురం వద్ద గురువారం రాత్రి బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో గొండుపాలెం గ్రామానికి చెందిన మద్దాల శివ ప్రసాద్(38) మృతిచెందాడు. కె.సంతపాలెం నుంచి పల్సర్ బైక్‌పై వస్తున్న శివప్రసాద్ బండి పెట్రోల్ అయిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాన్ని నడిపించుకుంటూ వస్తున్న శివప్రసాద్‌ను ఎదురుగా కె.కోటపాడు నుంచి పినగాడి వైపు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌ను నడిపించుకుంటూ వస్తున్న శివప్రసాద్ తల, ముఖం భాగంతో పాటు కాలిపైనా తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో కె.కోటపాడు సీహెచ్‌సీకి శివప్రసాద్‌ను తీసుకువెళ్లారు. కాగా అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య అపర్ణాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరో అరగంటలో ఇంటికి చేరుకుంటాడని ఎదురు చూస్తున్న సమయంలో భర్త శవమై ఇంటికి వచ్చాడని భార్య, పిల్లలు గుండెలు అవిసేలా రోధించడం స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి సోదరుడు గణేష్ కె.కోటపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. శివప్రసాద్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అందించారు.

బెల్లం మార్కెట్ సందర్శన



ఎన్టీఆర్ మార్కెట్‌లో బెల్లం దిమ్మలను పరిశీలిస్తున్న రోటరీ ఫాస్ట్ జిల్లా గవర్నర్ విశ్వనాథం, అమెరికా క్లబ్ సభ్యుడు బ్రెయిన్ రాలీ

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌ను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ ఫాస్ట్ జిల్లా గవర్నర్ విశ్వనాథం, అమెరికా క్లబ్ సభ్యుడు బ్రెయిన్ రాలీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా బెల్లం దిమ్మలను పరిశీలించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోటరీ చేస్తున్న సేవల గురించి విశ్వనాథం వివరించారు. అనకాపల్లి బెల్లం ఎంతో ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ బెల్లం అమెరికా, ఇంగ్లండ్, తదితర దేశాలకు ఎగుమతి అవుతుందని అమెరికా క్లబ్ సభ్యుడు బ్రెయిన్ రాలీకి తెలియజేశారు. అంతకు ముందు ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో చెరకు పరిశ్రమను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ, రోటరీ క్లబ్ సభ్యులు ఆర్ఎస్ రాజేశ్వర ప్రసాద్, బుద్ధ రమణాజీ, సాన త్రినాథ్, కుమార్, సతీష్, పీజే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్, బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇగ్నో బీఎస్సీ నర్సింగ్, బీఈడీ–2025 ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. నర్సింగ్ ప్రవేశాలకు https://ignounursing.samarth.edu.in/index.php ద్వారా, బీఈడీ ప్రవేశాలకు https://ignou&bed.samarth.edu.in/index.php/ లింక్ ద్వారా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు. ఫిబ్రవరి 21లోగా దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ధర్మారావు తెలిపారు.

నేడు చింతామణి గణపతి దత్తక్షేత్రంలో

సత్యనారాయణస్వామి వ్రతాలు

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో శనివారం ఉదయం 9 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు దత్తక్షేత్ర నిర్వాహకులు ఆంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కూర్మన్నపాలెం వారిచే నృత్య నికేతన్ డ్యాన్స్, ఆశ్రమ బాల దత్త బృందం వారితో బాల సచ్చిదానంద ప్రదర్శన, 5 గంటలకు శ్రీచక్రపూజ, 6 గంటలకు మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ స్వాగత సభ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరుల 200వ ఊంజల్ సేవ


ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీపరమేశ్వరుల 200వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పాండూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషు, సాయిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నమాచార్య వాగ్గేయ వరద వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి బృంద సభ్యులచే కోలాటాలు, కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం వన సమారాధన రేపు


వనసమారాధన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముప్పన సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం వనసమారాధన కార్యక్రమం ఈ నెల 26 మండలంలో శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు సంఘం కార్యాలయంలో శుక్రవారం వనసమారాధన కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి వెంకటరమణ, చలనచిత్ర దర్శకుడు నక్కిన త్రినాథ్ రావు, విశాఖ దేవాంగ సంఘం అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ విచ్చేయుచున్నట్లు చెప్పారు. సంఘం పరిధిలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దంపతులను శాలువాలతో సత్కరిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 6,762 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,320	5,510
మొదటి రకం	3,600	4,250
రెండో రకం	3,070	3,790
మూడోరకం	2,850	3,060

అనకాపల్లి సినిమాలు

దాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	:సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజ్	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	:షిర్డీసాయి
హంగ్ కాంగ్ వారియర్స్	:వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	:శ్రీసత్య
ఐడెంటీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు , బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 333 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

బార్లను తలపిస్తున్న మద్యం దుకాణాలు

- వాటి వద్దే బహిరంగ మద్యపానం
- మహిళలు, విద్యార్థుల భయాందోళన


కొత్తూరు-శారదానగర్‌లో మద్యం దుకాణం వద్దంటూ నిరసన చేస్తున్న మహిళలు (ఫైల్)


తుమ్మపాల మద్యం దుకాణం ముందే బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు


తుమ్మపాల మద్యం దుకాణం పక్కన దుర్భరంగా దర్శనమిస్తున్న ప్లాస్టిక్ వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు

తుమ్మపాల: మద్యం దుకాణాలు కాస్తా బార్లను తలపిస్తున్నాయి. అక్కడ ఆరుబయట మందుబాబులు విచ్చలవిడిగా మద్యం తాగి, ఖాళీ సీసాలు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు పడేసి వెళ్లిపోతున్నారు. దాంతో అవి దుర్భరంగా దర్శనమిస్తున్నాయి. వాటి చుట్టూ నెలకొన్న అపరిశుభ్ర వాతావరణంతో మహిళలు, విద్యార్థినులు, వృద్ధులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

విచ్చలవిడిగా విక్రయాలు...

నియోజకవర్గంలో మద్యం దుకాణాల వద్ద విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. దుకాణం చుట్టూ మందు గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు దుర్భరంగా దర్శనమిస్తున్నాయి. వీటి దుర్వాసనతో సమీప ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటుగా రాకపోకలు చేస్తున్న విద్యార్థులు, మహిళలు, వృద్ధులు దుకాణం ఉన్న ప్రాంతాన్ని దాటి ముందుకు సాగడానికి తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మద్యం దుకాణాల ముంగిటే రోడ్లపైనే యువత మందు బాటిళ్లు ఎత్తడం, నిత్యం అక్కడే తిష్ట వేయడంతో వారి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో చక్కని వాతావరణంగా ఉన్న ప్రాంతాల్లో మద్యం దుకాణాలు నిర్వహించడంతో స్థానికులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొత్తూరు శారదానగర్‌లో విద్యావంతులు, ఉపాధ్యాయులు, ఆలయాలతో శాంతియుతంగా ఉండే గృహాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ మొదటి నుంచి మహిళలంతా వ్యతిరేకిస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. వారు చేసిన ఫిర్యాదులకు ఎండార్స్‌మెంట్లు ఇచ్చి ఎక్సైజ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మందుబాబుల గోలతో ఇబ్బందులు...

పట్టణంలో గూడ్స్ రోడ్డు, పూడిమడక రోడ్డు, సత్యనారాయణ థియేటర్ వద్ద మద్యం షాపుల సమీపంలోనే స్నాక్స్ దుకాణాలు పెట్టి వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు అందించడంతో నిత్యం రద్దీగానే దర్శనమిస్తున్నాయి. కశింకోట కనకమహాలక్ష్మి బజార్ దగ్గర దుకాణం వద్ద అర్ధరాత్రి వరకు బడ్డీల్లో మద్యం విక్రయిస్తున్నారని, రాత్రిళ్లు నిద్రపోయేందుకు కూడా మందుబాబుల గోలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మామిడిపాలెం, తుమ్మపాల, రేబాక గ్రామాల్లో మద్యం దుకాణాలు మరింత దారుణంగా తయారయ్యాయి. దుకాణం ఉన్న ప్రాంతం మద్యం జోన్‌లను తలపిస్తోంది. అటుగా ప్రజలు రాకపోకలు చేయలేకపోతున్నారు. మద్యం దుకాణానికి ఇరువైపులా స్నాక్స్ కోసం బడ్డీలు పెట్టి బార్లను తపలించేలా మందుబాబులకు అన్ని సదుపాయాలు అందిస్తున్నారు.

మద్యం దుకాణాల వద్ద స్నాక్స్ విక్రయిస్తే చర్యలు

మద్యం దుకాణాల వద్ద స్నాక్స్, తినుబండారాల బడ్డీలో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణాల సమీపాల్లో బడ్డీలు ఉన్నప్పటికీ వారు మద్యం విక్రయాలు చేయడం లేదు. విక్రయించినట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తున్నాం. తినుబండారాల దుకాణాలు వద్ద తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు చెత్త లేకుండా మున్సిపాలిటీ, పంచాయతీలు చూసుకోవాలి.

– వై.లక్ష్మణనాయుడు, సీఐ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ, అనకాపల్లి

ఆకట్టుకున్న బుర్రకథ


కొణతాల మనోహరనాయుడు తీర్థంలో బుర్రకథ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద దివంగత కొణతాల మనోహరనాయుడు తీర్థ మహోత్సవం శుక్రవారం రాత్రి జరిగింది. చిన్నారుల ఆట వస్తువులు, ఇతర వినోద ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రికి బుర్రకథ, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాములు అలరించాయి.

రక్తదానంతో ఆరోగ్యం


రక్తదానం చేస్తున్న పెతకంశెట్టి జోసెఫ్

అనకాపల్లి: యువకులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ప్రతినిధి పెతకంశెట్టి జోసెఫ్ అన్నారు. స్థానిక గ్రంధి కన్నయ్య మెమోరియల్ హాల్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు, అత్యవసర ఆపరేషన్ సమయంలో వారికి రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు ఘన సత్కారం


మాజీ మంత్రి అమర్‌నాథ్‌ను గుండా జంక్షన్ వద్ద శాలువా వేసి, గజమాలలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ శ్రేణులు శాలువాలు, గజమాలలతో ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక గుండా జంక్షన్ వద్ద పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య తేడాలను రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇప్పటికే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, కూటమి పాలనలో ఏ ఒక్కా పథకం అందలేదని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు కలగా లక్ష్మీగున్నయ్యనాయుడు, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, మండల కార్యదర్శి భీశెట్టి జగన్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఉగ్గిన అప్పారావు, వేగి త్రినాథ్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాలురుతో సమానంగా బాలికలకు ఉచిత విద్య


తేగాడ కేజీబీవీలో బాల్య వివాహాల నిషేధంపై పోస్టర్ ప్రదర్శిస్తున్న సీడీపీవో ప్రభావతి, తదితరులు


కశింకోట బాలికల హైస్కూలులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో కళావతి

కశింకోట: ప్రభుత్వం విద్యను ప్రోత్సహిస్తూ బాలికలకు భద్రత, ఆరోగ్యాన్ని కల్పిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో పి. ప్రభావతి అన్నారు. తేగాడ కేజీబీవీలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల రక్షణ కోసం ఫోక్సో, ఇతర చట్టాలను అమలు చేస్తుందన్నారు. అన్యాయం జరిగినప్పుడు వీటిని వినియోగించుకోవాలన్నారు. గర్భధారణ సమయంలో లింగ వివక్షను ప్రభుత్వం నిషేధించిందన్నారు. బాలురుతో సమానంగా బాలికలకు 14 ఏళ్ల వరకు ఉచిత విద్య అందిస్తుందన్నారు. బాల్య వివాహాలను నిషేధించిందన్నారు. 18 ఏళ్ల నిండే వరకు వివాహాలు చేసుకోరాదన్నారు. ప్రిన్సిపాల్ ఒ. చంద్రకళ, ఆరోగ్య, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కశింకోట బాలికల హైస్కూలులో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులు ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీవో కళావతి ఆధ్వర్యంలో బాల్య వివాహాలు నిషేధం అమలుకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి, పీడీ పెంటకోట కమల, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఝాన్సీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల భవిష్యత్‌కు మార్పు


తుమ్మపాల పీహెచ్‌సీ వద్ద నినాదం చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు, వైద్య సిబ్బంది

అనకాపల్లి: పట్టణ, మండలంలో జాతీయ బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తుమ్మపాల పీహెచ్‌సీ సమీపంలో సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు మాట్లాడుతూ ఆడపిల్లలపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యతోనే మహిళల భవిష్యత్‌కు మార్పు చేకూరుతుందన్నారు. అంతకుముందు తుమ్మపాల హైస్కూల్ విద్యార్థినులు పీహెచ్‌సీ వరకూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయవాది లక్ష్మి

నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

నాంది ఫౌండేషన్, టెక్ మహేంద్ర ఆధ్వర్యంలో సీహెచ్‌ఎన్ అగ్రహారంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన న్యాయవాది లక్ష్మి, జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ బాలికలను రక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అంతకుముందు అచ్యుతాపురం, కశింకోట, కొక్కిరాపల్లి, తెగాడ, మునగపాక బాలికలకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మండల క్రీడా కార్యదర్శి నాగేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

27 నుంచి కలెక్టరేట్ వద్ద వీవోఏల నిరసనలు


మాట్లాడుతున్న రూపాదేవి

అనకాపల్లి: వెలుగు వీవోఏలకు బకాయిపడ్డ ఆరు మాసాల జీతాలు కూటమి ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకూ కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేస్తామని ఏపీ వెలుగు వీవోఏల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉపాధికి భద్రత కల్పిస్తూ 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, బకాయిపడ్డ కార్మికుల జీతాలు చెల్లించాలని కోరారు. సంక్రాంతి పండగకు జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ నెల 31వ తేదీలోపు సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పనులను నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు, కోశాధికారి కె.లక్ష్మీప్రసన్న, నాయకులు వై.లక్ష్మి, పి.వరలక్ష్మి, డి.రాము, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణకు ప్రభుత్వ ప్రోత్సాహం


అచ్చెర్లలో మందులు అందిస్తున్న పశు వైద్యాధికారి డయానా

కశింకోట: పశు పోషణకు పలు నూతన పథకాలు ప్రవేశ పెట్టి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి బి. రామ్మోహన రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని పల్లపు సోమవరంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ఎమెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. శిబిరం నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. రైతులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోకులం, బహు వార్షిక పశుగ్రాస క్షేత్రాలు, లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆవు పెయ్యిలను ఉత్పత్తి చేయడం, పిండ మార్పిడి విధానం, పశు బీమా, రాయితీపై ఇన్‌పుట్స్ అందివ్వడం జరుగుతుందన్నారు. సంచార పశు వైద్య విధానం అమలు చేస్తున్నామన్నారు. పశు వైద్యాధికారి సిహెచ్ చైతన్యమణి శిబిరంలో 25 పశువులకు వైద్య పరీక్షలు, 16 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి 64 ఆవులు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పవు సంవర్ధక సహాయ సంచాలకురాలు బి. సౌజన్య, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. అచ్చెర్లలో కస్నూరుపాలెం పశు వైద్యాధికారి డయానా ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు వైద్య సేవలందించారు.

చైతన్య, నారాయణ విద్యా సంస్థలపై చర్యలకు డిమాండ్


ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, రమణ

అనకాపల్లి: రాష్ట్రంలో విద్యార్థులకు పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో కార్పొరేట్ విద్యా సంస్థలైన చైతన్య, నారాయణ కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని తీవ్రమైన వేధింపులకు గురిచేస్తున్నారని, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.రమణ డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల సంక్రాంతి సెలవుల నుంచి వచ్చిన విద్యార్థి ఫీజు కడితేనే లోపలికి అనుమతిస్తామని విజయవాడ శ్రీచైతన్య యాజమాన్యం చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అర్ధరాత్రి తన తండ్రితో నిరసన తెలియజేయడంతో అనుమతించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన పథకం అమలు చేయకపోవడంతో విద్యార్థులు ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ నెల 23న అనంతపురంలోని నారాయణ కళాశాలలో ఫీజు చెల్లించలేదని గంటల తరబడి విద్యార్థిని నిలబెట్టడంతో మనస్తాపానికి గురై అక్కడికక్కడే మూడో అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యా సంస్థలను విచ్చలవిడి దోపిడీని అరికట్టడంలో విఫలమైందన్నారు. విద్యార్థి మృతి చెందినప్పటికీ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ చోద్యం చూస్తున్నారన్నారు. కార్పొరేటు విద్యా సంస్థల్లో విద్యార్థులు చనిపోతున్నారని ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ చెప్పిన విషయం మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం రెండు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు.

విద్యార్థులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి


వెదురుపర్తి హైస్కూలులో మాట్లాడుతున్న హెచ్‌ఎం మూర్తి


విద్యార్థులకు గుడ్డ సంచులు అందజేసిన స్పందించే హృదయం సంస్థ

కశింకోట: మండలంలోని వెదురుపర్తి హైస్కూలులో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం ఎ.వి.ఎస్. మూర్తి మాట్లాడుతూ విద్యార్థులను టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచి వేకువజామున నిద్ర లేపి చదివించడం పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. టెన్త్ హోప్ పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తల్లిదండ్రులకు తెలియజేశారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందజేశారు. స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ తల్లిదండ్రులు, విద్యార్థులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ గనిరెడ్డి శివ, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, ఎ. సోమరాజు, రమేష్, పి.వి. సత్యనారాయణ మూర్తి, వై. విజయ, త్రివేణి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

పల్లపు సోమవరం గ్రామానికి జాతీయ పురస్కారం లక్ష్యం

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


సోమవరం-ఏనుగుతుని రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట: పల్లపు సోమవరం గ్రామానికి జాతీయ స్థాయి పురస్కారం రావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవరం గ్రామం నుంచి ఏనుగుతుని గ్రామానికి రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్డును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ సోమవరం గ్రామాన్ని ఇంకా అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి తోడ్పాటును అందిస్తానన్నారు. నరసింగబిల్లి - సోమవరం గ్రామాల మధ్య నరసింగబిల్లి రైల్వే గేటుపై ఫ్లైఓవర్‌ను రూ.6.50 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. దీనివల్ల నరసింగబిల్లి నుంచి అనేక గ్రామాలకు రోడ్డు సదుపాయం మెరుగుపడి అచ్యుతాపురం సెజ్ వరకు రాకపోకలకు అనువుగా ఉండనుందన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ.11 కోట్లతో వచ్చే ఏడాదికి అన్ని గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. నరసింగబిల్లి రైల్వే లైన్ ప్రాంతంలో దెబ్బతినడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వచ్చే నెలలోగా గ్రామానికి విద్యుత్ సమస్య పరిష్కరిస్తానన్నారు. సోమవరం గ్రామంలో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించడానికి నిధులు సమకూరుస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సర్పంచ్ గొంతిన నాగరత్నం, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈఓపిఆర్ ఎం. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు


కశింకోటలో శారదానది ప్రాంతంలో దట్టంగా ఆవహించిన మంచు


మంచులో శారదానదిపై దోనెపై రైతుల ప్రయాణం

కశింకోట: కశింకోటలో శుక్రవారం ఉదయం విపరీతంగా మంచు కురిసింది. దీంతో జన జీవనానికి ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారు. ఉదయం పది గంటల వరకు సూర్యుడు కానరాలేదు. ఇళ్లు, చెట్లుపై మంచు పరదాల్లా కమ్ముకొంది. స్థానిక శారదానది ప్రాంతం, పొలాల్లో మంచు ఆవహించింది. దీంతో పొలాలకు రాకపోకలు సాగిండానికి రైతులు, పాడి రైతులు దారి కానక ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం పది గంటల ప్రాంతంలో సూర్యుడు రావడం ప్రారంభం కావడంతో క్రమేపి మంచు కనుమరుగైంది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఏడాది ఇంత ఎక్కువగా మంచు పడటం ఇదే ప్రథమం. దీంతో మంచు వల్ల మామిడి, జీడిమామిడి పూతలు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.